



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

స్పోర్ట్స్ హాస్టల్ తరలింపునకు యత్నం

- కోచ్‌లే సూత్రధారులా..?
- కోచింగ్‌పై దృష్టి లేకుండా సెంటర్ మార్పునకు పైరవీలు
- ఆవేదనలో క్రీడాకారులు
- ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఎంపీ దృష్టికి వెళ్లడంతో వార్నింగ్



ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఎఐ) హాస్టల్‌ను ఇతర జిల్లాకు తరలించాలన్న ప్రతిపాదన జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందన్న కారణంతో మొత్తం ఎస్ఎఐ హాస్టల్‌ను తిరుపతికి తరలించాలనే యత్నాలు జరుగుతున్నాయన్న సమాచారం క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానికుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.ఈ వ్యవహారంలో కొంతమంది కోచ్‌లే సూత్రధారులని చర్చ జరుగుతోంది. వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రీడాకారుల శిక్షణ, కోచింగ్ నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన కోచ్‌లు సెంటర్ మార్పు కోసం పైరవీలు చేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

22 ఏళ్ల క్రీడా వారసత్వం ప్రమాదంలో: 2001లో ప్రారంభమైన కర్నూలు ఎస్ఎఐ హాస్టల్ 22 సంవత్సరాలుగా జిల్లాకు చెందిన అనేక మంది పేద, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆశ్రయంగా నిలుస్తోంది. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, టెక్వాండో వంటి క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన పలువురు క్రీడాకారులను ఈ హాస్టల్ దేశానికి అందించింది.

పేద క్రీడాకారులకు లైఫ్‌లైన్: దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందే ఆర్థిక స్థోమత లేని నిరుపేద యువతకు కర్నూలు ఎస్ఎఐ హాస్టల్ ఒక లైఫ్‌లైన్‌లా మారింది. హాస్టల్ తరలింపు జరిగితే జిల్లాలోని అనేక మంది ప్రతిభావంతులైన క్రీడాకారుల భవితవ్యం అంధకారంలో పడిపోతుందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

తరలింపు కాదు పునరుద్ధరణే పరిష్కారం: హాస్టల్ భవనానికి మరమ్మతులు అవసరమన్న విషయాన్ని తాము అంగీకరిస్తామని, కానీ దానికి పరిష్కారం తరలింపు కాదని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. భవనం ప్రమాదకరంగా ఉంటే అదే స్థలంలో కొత్త భవనం నిర్మించాలి లేదా సమీపంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త హాస్టల్ కేటాయించాలన్నది వారి స్పష్టమైన డిమాండ్.

కలెక్టర్‌కు ఫిర్యాదు-ఎంపీ హెచ్చరిక: ఎస్ఎఐ హాస్టల్ తరలింపు యత్నాలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు క్రీడాకారులు, క్రీడాభిమానులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ అంశం ఎంపీ దృష్టికి వెళ్లడంతో సంబంధిత అధికారులకు వార్నింగ్ కూడా వెళ్లినట్టు తెలిసింది. అయినప్పటికీ తెరవెనుక ప్రయత్నాలు కొనసాగుతున్నా యన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

సార్వత్రిక మద్దతుతో ఉద్యమానికి పిలుపు : కర్నూలులోనే ఎస్ఎఐ హాస్టల్ కొనసాగాలంటూ ప్రజలు తమ గళం వినిపించాలని క్రీడాభిమానులు పిలుపునిస్తున్నారు. 'సేవ్ ఎస్ఎఐ కర్నూలు", 'రినోవేట్ డోంట్ రిలోకేట్' నినాదాలతో ఉద్యమం చేపట్టాలని క్రీడాకారులు సిద్ధమవుతున్నారు. కర్నూలు యువత క్రీడా భవితవ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వెంటనే స్పందించి హాస్టల్ తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుని పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని జిల్లా వాసులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

స్పోర్ట్స్ హాస్టల్ కర్నూలులోనే ఉండాలి



కర్నూలులో స్పోర్ట్స్ హాస్టల్ సాధనకు మాజీ మంత్రి టిజి.వెంకటేష్, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ పట్టుదలతో కర్నూలు స్పోర్ట్స్ హాస్టల్‌ను సాధించారు. ఇక్కడ హాస్టల్‌ఉండటం చాలా మంది రాష్ట్ర, జాతీయ, అంతర్‌జాతీయ స్థాయిలో క్రీడాకారులు మెడిల్స్ సాధించారు. జిల్లాకు మంచి పేరువచ్చింది. హాస్టల్ భవనాన్ని రిపేరుచేసి తిరుపతికి తరలించకుండా ఇక్కడే కొనసాగేలా చూడాలి. పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ చొరవ తీసుకుని ఇక్కడే కొనసాగేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

- జి.షబ్బీర్ హుస్సేన్, తైక్వాండో ఎన్ఐఎస్ కోచ్.

ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దు

-12వ పిఆర్‌సి కమిషన్ ప్రకటించాలి - టెట్‌పై రివ్యూ పిటిషన్ వేయాలి
- యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నేతలు సురేష్ కుమార్, లక్ష్మీరాజా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టెన్త్ స్పెషల్ క్లాస్‌ల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించి 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ కర్నూలు జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్ , ఎస్‌టిఎఫ్ఐ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా ఎగరవేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కె. సురేష్ కుమార్, లక్ష్మీరాజాలు మాట్లాడుతూ ఇన్ సర్వీస్‌లో ఉన్నటువంటి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహించడం సరైనది కాదన్నారు. టెట్ పరీక్షను ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న జిల్లా కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. విద్యా హక్కు చట్టంలో మార్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జనవరి 29న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల పేరుతో వందరోజుల ప్రణాళికను అమలు చేస్తూ ఉపాధ్యాయులపై తీవ్రనిర్బంధాన్ని ప్రదర్శించడం తగదన్నారు. సెలవుల్లో కూడా ఉపాధ్యాయులకు ప్రత్యేక క్లాసుల పేరుతో నిర్వహించడం తగదన్నారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుతంగా బోధన చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఉద్యోగుల పెండింగ్ ఆర్థిక బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటీ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ లోని ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, జీవిత, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, ఇబ్రహీం, భాస్కర్ గాదలింగన్న, వెంకటేష్ ,లక్ష్మీదేవి, బాబు, కౌలన్న దుర్గా ప్రసాద్, చంద్రకళ ,సురేష్ బాబు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పల్లెల్లో పోలీసుల రాత్రి బస

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాలలో జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు 6 గ్రామాలలో రాత్రి బస (పల్లెనిద్ర) కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాల జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మకూడదని, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలు, సైబర్ మోసాల బారిన పడకూడదని, అపరిచితుల కాల్స్ లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు తెలియని ఎవరికి చెప్పకూడదన్నారు. రోడ్డు ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన చేస్తున్నారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. పోలీసు అధికారులు, గ్రామాలలోని ప్రజలు యువత, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీస అధికారులు

సిఐటియు మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని బళ్లారి చౌరస్తా సి. క్యాంపు సెంటర్, వైభవ్ కాలనీ లో నూతన ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసి ఆటో కార్మికుల సిఐటియులో చేరిన సందర్భంగా సిఐటియు పతాకాలను ఎగరవేశారు. ఆదివారం బళ్లారి చౌరస్తా సి క్యాంపు సెంటర్, వైభవ్ కాలనీ ఆటో అడ్డాల సిఐటియు జెండాలను ఆటో యూనియన్ సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి. రాధాకృష్ణ ఎగురవేశారు. ఈ కార్యక్రమాలకు హాజరై ఆటో కార్మికుల ఉద్దేశించి ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ న్యూ సిటీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల జీవోల పేరుతో అధిక చలానాలు విధిస్తూ కార్మికులను నిలువు దోపిడికి గురి చేస్తున్నాయన్నారు. రవాణా రంగ కార్మికులైన ఆటో కార్మికులకు ఎలాంటి ప్రయోజనకర కార్యక్రమాలు చేయడం లేదన్నారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాల టాక్స్ అపరాధరుసుము పేరుతో భారీ మొత్తంలో చలానా ఫీజులు పెంచారని వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 31న నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు18 వ అఖిలభారత మహాసభలో ప్రతినిధులు చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. నాలుగున జరిగే బహిరంగ సభలో పాల్గొని కార్మిక సత్తా చాటాలని వారు డ్రైవర్లకు పిలుపునిచ్చారు. సిపిఎం 42వ వార్డు మాజీ కార్పొరేటర్ సి.చలపతి, ఆటో యూనియన్ న్యూ సిటీ నగర అధ్యక్షులు ఎస్.హుస్సేన్ వలీ, ఉపాధ్యక్షులు రాము, మాలిక్‌బాష, శేఖర్ ,శీను, మధు, జయన్న, నాగేంద్ర, శామ్, అక్రమ్, సామెల్, శ్రీను. శేఖర్, భరత్, రవి యేసు, డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం బళ్లారి చౌరస్తా హనుమాన్ స్టాండ్ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కిరణ్, రాములను ఎన్నుకున్నారు.


సిఐటియు ఆటో యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్

స్వచ్ఛ నగర సాకారానికి కీలక అడుగులు

- ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్
-మంత్రి, ఎమ్మెల్యేల చొరవతో 27 జెసిబిలు - స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం
-శుభ్రతను ప్రజలు బాధ్యతగా భావించాలి : కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలును స్వచ్ఛ నగరంగా సాకారం చేయాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ కీలక చర్యలు చేపడుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగర పరిధిలోని ఖాళీ స్థలాల్లో విస్తరించిన పిచ్చి మొక్కల తొలగింపునకు 27 జెసిబిలతో స్పెషల్ డ్రైవ్‌ను కమిషనర్ ప్రారంభించారు. నగరంలోని ఐదు రహదారుల కూడలి సమీపంలోని పాత ఎస్‌పి బంగ్లా వద్ద జెండా ఊపి ఈ స్పెషల్ డ్రైవ్‌కు కమిషనర్ ప్రారంభించారు. అనంతరం బుధవారపేట స్మశాన వాటిక పక్కన, కొత్తపేట ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో విపరీతంగా ఉన్న పిచ్చి మొక్కల తొలగింపును పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల వల్ల పాములు, తేళ్లు, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతున్నాయని, పందులు ఆవాసంగా మార్చుకుని పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. నగర శుభ్రత, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తప్పనిసరిగా అమలు చేస్తున్నామని తెలిపారు. విస్తరిత ప్రాంతాల్లో ఖాళీ స్థలాల సమస్య అధికంగా ఉండటంతో ఆయా డివిజన్లకు అవసరమైన మేర జెసిబిలను కేటాయించి, ఒకేసారి శుభ్రత పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరిల చొరవతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి 27 జెసిబిలను అందించడం అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల భాగ స్వామ్యంతోనే స్వచ్ఛ నగర లక్ష్యం సాధ్యమవు తుందని, శుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి నగరపాలక సంస్థకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఖాళీ స్థలాల యజమానులు స్వచ్ఛందంగా శుభ్రత పాటించకపోతే నగరపాలక సంస్థ చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తుందని, జరిమానా చెల్లించిన తర్వాతనే సంబంధిత భవన నిర్మాణ అనుమతులు, విఎల్‌టి, ఆస్తి పన్ను ప్రక్రియలు చేపడతామని కమిషనర్ స్పష్టం చేశారు. అప్పటివరకు ఆ స్థలాలను కార్పొరేషన్ కార్య కలాపాలకు వినియోగించుకుంటామని వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, ఎంఇ మనోహర్ రెడ్డి, డిఇఇలు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఎఇ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం


ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో అమీలియో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు డాక్టర్ శైలజ, బెటర్ రమాదేవి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ అధునాతనమైన పద్ధతిలో తమ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి గ్రామ నాయకులు విజయుడు, కాజ మియ్యా, సర్కార్, హుస్సేన్, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రెస్‌క్లబ్ సభ్యత్వం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 15 ,16 తేదీల్లో ప్రెస్ క్లబ్ కార్యాలయంలో , సమాచార శాఖ ఆవరణలో జరిగే ప్రెస్ క్లబ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కె. సత్యనారాయణ గుప్త ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు సభ్యత్వం తీసుకున్న సభ్యులతో చర్చించాక 15, 16 తేదీల్లో ఉదయం 11 నుండి 1 గంట వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలనకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాత్రికేయ మిత్రులందరూ సహకరించాలని కోరారు. ఇటీవల సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయ మిత్రుల సమావేశం నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు అందరూ అంగీకరించారు. అడ్‌హక్ కమిటీ వేయాలని సూచించారు. అయితే సభ్యత్వం ఉన్నవారితోనే అడ్‌హక్ కమిటీ వేయాలని ప్రెస్‌క్లబ్ బైలా తెలుపుతుంది. దయచేసి అందరూ సభ్యులుగా చేరాక, నూతన కమిటీ లేదా అడ్‌హక్ కమిటీ ఎలాగైనా చేసుకోవచ్చని, సభ్యత్వం అందరూ తీసుకున్నాకనే సభ్యులకు మాట్లాడే అర్హత, కమిటీలో ఉండటానికి అర్హత ఉంటుందని తెలిపారు. దీనిని అంకీకరించని కొందరు అనవరసరంగా కామెంట్లు చేస్తున్నారన్నారు. దయచేసి సభ్యులుగా చేరండి ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ వేసుకుందామని సత్యనారాయణ గుప్త పాత్రికేయులకు విజ్ఞప్తి చేశారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ మండల మున్సిపల్ కేంద్రాల్లో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితులు నేరుగా వచ్చి సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

రాజ్యాధికారం కోసం బహుజనులు ఏకమవ్వాలి

- కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు ఐక్యమైతే రాజ్యాధికారం మనదే
- మాజీ డిజిపి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు - కర్నూలులో ఓబిసి కన్వెన్షన్ విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాజ్యాధికారం కోసం బహుజనులంతా ఏకమవ్వాలని కర్నూలు మాజీ ఎంపి డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బాంసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఒబిసి కన్వెన్షన్ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా బిసి,ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ ఆశాజ్యోతుల చిత్రపటాలకు పూలు వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ పీఠిక చదివించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ నేటికీ దేశంలో అగ్రవర్ణాలదే పెత్తనం నడుస్తుందన్నారు. అగ్రవర్ణాల అణిచివేత ధోరణిని తిప్పికొట్టేందుకు బహుజనలంతా ఏకమవ్వాలని కోరారు. మాజీ డిజిపి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న ఒబిసిలకు కాదని కేవలం ఐదు నుంచి 8 శాతం మంది ఉన్న రెడ్లు, కమ్మలు, వెలమలు అధికారాన్ని ఏలుతున్నారన్నారు. ఓట్లు మనవి అయినప్పుడు అధికారం కూడా మనదే అవ్వాలని, అందుకు కలిసికట్టుగా పోరాడి సాధించుకోవాలన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో పాటు ఎస్‌సి, ఎస్‌టి,బిసి మైనార్టీల అభ్యున్నతి కోసం పాటుపడిన మహానుభావుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు అడుగు ముందుకు వేయాలని పిలుపునిచ్చారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ బాంసెఫ్ నాయకులు డాక్టర్ కంచర్ల హరిప్రసాద్, డాక్టర్ నిరంజన్, శేషఫణి, పట్నం రాజేశ్వరి, ఎం.ఖదీరుల్లా తదితరులు మాట్లాడుతూ దేశంలోని పాలకులు ఒబిసిల కులగణన చేస్తామని అంటూ కాలం సాగదీస్తున్నా రన్నారు. కుల గణనకు సమయం వచ్చినప్పుడల్లా ఏదో ఒక ఘటన సృష్టించి ఆటంక పరుస్తున్నారని తెలిపారు. ఇవిఎంల ద్వారా ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని, బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. 2013 అక్టోబర్ 8న భారత సుప్రీం కోర్ట్ ఇవిఎంలతో జరిగే ఎన్నికలు పారదర్శకంగా ఉండవని తీర్పు ఇచ్చిందన్నారు. పారదర్శకత పెంచడానికి ఇవిఎంలకు వివి ప్యాట్స్ మెషిన్ జోడించాలని తీర్పు ఇచ్చినప్పటికి ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా ఈ పని చెయ్యకపోవడం విచారకరమన్నారు. ఇవిఎంలతో ఎన్నికలు వద్దని తమ సంఘం ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో కేసు వేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి ఒబిసి ప్రతినిధులు, బాంసేఫ్ నాయకులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ, మాజీ డిజిపి తదితరులు

గ్రంథాలయ సంస్థ స్థలం కబ్జాపై పోరాటం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు పట్టణంలో ఉన్న గ్రంథాలయ సంస్థ స్థలం కబ్జాచేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని వక్తలు పేర్కొన్నారు. కోడుమూరు పట్టణంలో ఆదివారం ఉదయం యూత్ రిక్రియేషన్ సెంటర్‌లో అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. నాయకులు లాయర్ ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కోడుమూరు గ్రంథాలయ సంస్థ స్థలం కబ్జా పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ పట్టాలు సృష్టించుకొని లైబ్రరీ స్థలం కబ్జా చేస్తే పోరాటం చేయక తప్పదని వక్తలు హెచ్చరించారు. దొంగ పట్టాలు సృష్టించుకొని గ్రంథాలయ స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేస్తుంటే కోడుమూరు గ్రామ పంచాయతీ ఏమి చేస్తోందని నిలదీశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గానికి అన్ని తెలిసినా ఎందుకు మిన్నకుండి చోద్యం చూస్తుందని ప్రశ్నించారు. వెంటనే గ్రామ పంచాయతీ కబ్జా చేస్తున్న వారికినోటీస్‌లు ఇచ్చి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని గ్రామ పంచాయతీ పాలక వర్గం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి పన్నుతో పాటు గ్రంథాలయ పన్నును ప్రజలు గ్రామ పంచాయతీకి చెల్లిస్తుంటే గ్రామ పంచాయతీ గ్రంథాలయ సంస్థ స్థలంలో అక్రమ కట్టడాలు జరుగుతుంటే గ్రామ పంచాయతీ నిద్ర పోతుందా అని నిలదీశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం రాత్రి వరకు సమయం ఇచ్చి మంగళవారం నుండి అక్రమ నిర్మాణం పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సభ్యులు సూచించారు. మంగళవారం నుండి కోడుమూరు మన గ్రంథాలయం పేరుతో గ్రంథాలయ స్థలాన్ని పరిరక్షించు కుందామని వక్తలు సూచించారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణం ఆపాలని, ప్రభుత్వ స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఈత క్రీడాకారులను అభినందించిన ఎంపీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న 69వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటున్న జిల్లా ఈత క్రీడాకారులను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అభినందించారు. అండర్ 19 విభాగంలో పాల్గొంటున్న పి. హేమలత, అండర్ 17 విభాగంలో పాల్గొంటున్న కె.శృతి, సిరి చేతన రాజ్, పి.లహరిలను ఢిల్లీలో ఎంపీ అభినందించారు. వారు పాల్గొంటున్న ఈవెంట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆయన వారిని ప్రోత్సహించారు.


క్రీడాకారిణులను అభినందిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు


స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి

- స్వెట్టర్లు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూలు లోని గురుదత్త పాలీక్లినిక్‌లో డాక్టర్‌శంకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద వృద్ధులకు స్వెట్టర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ ఈసంవత్సరం చలితీవ్రత ఎక్కువగా ఉందన్నారు. ముఖ్యంగా 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వృద్ధులను ఆదరించాల్సిన భాద్యత అందరిపైన ఉందని డాక్టర్‌శంకర్‌శర్మ కోరారు. ధనవంతులు పేదవారికి తగిన సహాయం చేయాలని కోరారు. వృద్ధులను సంరక్షించే భాద్యత ప్రభుత్వంతో పాటు ధనవంతులు కూడా సహాయం చేయాలని ఆయన కోరారు.

ఘంటసాల జీవితం పాఠ్యాంశంగా చేర్చాలి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : మధుర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల జీవిత చరిత్రను విద్యార్థులకు తెలిపే విధంగా పాఠ్యాంశంగా మార్చాలని ప్రకాశం జిల్లా ఘంటసాల సంఘం అధ్యక్షులు నాగశ్రీ, గుంతకల్లు ఘంటసాల అభిమాన సంఘ అధ్యక్షుడు రామాంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పాకాల కొండయ్య తెలిపారు. ఆదివారం రాత్రి టిజివి కళాక్షేత్రంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీశైలం ప్రాజెక్టు పాకాల కొండయ్య నిర్వహణలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పుష్పమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గాయనీ గాయకులు విజయవాడ జెస్సి గుంతకల్ వీరలక్ష్మి కర్నూలు లక్ష్మీ మహేష్‌తోపాటు శ్రీనివాసులు నాగశ్రీ పత్తి ఓబులయ్య రామాంజనేయులు కొండయ్యలను సత్కరించారు. అనంతరం ఘంటసాల పి.సుశీల పాడిన అనేక పాటలను జెస్సి వీరలక్ష్మి శ్రీనివాసులు కొండయ్య పాడి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమం నిర్వాహకులుగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కార్యదర్శి యాగంటి ఈశ్వర్ నిర్వహించారు.



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

నిరుపయోగముగా అంగన్వాడి కేంద్రం

-ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన భవనం
- దాదాపు 80శాతం పూర్తయి అసంపూర్తి
- గత టిడిపి ప్రభుత్వం లో నిర్మించిన భవనం

ప్రజాశక్తి-చిప్పగిరి

ఒక ప్రభుత్వంలో నిర్మించిన భవనాలను మరో ప్రభుత్వం వచ్చాక ఆ భవన నిర్మాణాలన్నీ కూడా ఆగిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత టిడిపి ప్రభుత్వం 2017-18లో అప్పటి ఎంపిపి పాముల పద్మావతి చొరవ తీసుకొని నేమ కల్లు గ్రామంలో రూ.7 లక్షల నిధు లతో అంగన్వాడి భవన నిర్మాణం చేప ట్టుటకు సుగుమం చేశారు. గ్రామంలో అణువుగా ఉన్న స్థలాలను పరిశీలించిన తర్వాత రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం ఉందని తెలుసుకొని అక్కడ నిర్మించుటకు అధికారులతో మాట్లాడి అంగన్వాడి భవన నిర్మాణం చేపట్టారు. అప్పటి టిడిపి ప్రభుత్వంలోనే దాదాపు 80శాతం అంగన్వాడి భవననిర్మాణం పూర్తి అయిందని గ్రామ ప్రజలు తెలుపు తున్నారు. కేవలం 20 శాతం ఉన్న పనులను వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆ పనులను పూర్తిగా మరిచి పోయింది. సంబంధిత అధికారులు కూడా ఉన్నతాధికారులకు ఏం సమాచారం ఇచ్చారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి మిగిలి ఉన్న 20శాతం పనులను పూర్తి చేయాలని, పూర్తిచేసి అంగన్వాడి పిల్లలకు ఉపయోగపడేలా అందుబాటులోకి తేవాలని నేమకల్లు గ్రామ ప్రజలు కోరుతున్నారు.



మా పై అధికారులకు తెలిపాం

- ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈరమ్మ



ఎనిమిదేళ్ల క్రితం నేమకల్లు గ్రామంలో నిర్మించిన అంగన్వాడి భవన నిర్మాణం అంతా కూడా దాదాపు 80 శాతం పూర్తయింది. కేవలం 20 శాతం పనులు మిగిలి ఉండడంతో నిరుపయోగంగా ఉంది. ఈ వివరాలన్నీ కూడా మా సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేసి భవన నిర్మాణం పూర్తి చేసేటట్లు చూస్తామన్నారు.

పాలకులు స్పందించాలి

ఆదోని జిల్లా సాధన కమిటీ డిమాండ్

ప్రజాశక్తి- ఆదోని

వెనుకబడ్డ ఆదోని జిల్లా తోనే అభివృద్ధి సాధ్యమని ఆ దిశగా సాగే ఉద్యమంలో పాలకులు భాగస్వామ్యమై గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలని ఎపి ఎన్‌జిఒ ఆదోని అధ్యక్షురాలు ఉషారాణి , స్త్రీ విముక్తి మహిళా నాయకురాలు సుజ్ఞానమ్మ డిమాండ్ చేశారు. ఆదోని జిల్లా సాధన కోసం పట్టణంలోనే కోట్ల కూడలిలో జెఎసి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్ష ఆదివారం 29వ రోజు చేరుకుంది శిబిరంలో మహిళలు దీక్షలో కూర్చున్నారు. శిబిరం నిర్వహణకు ఎన్‌జిఒ ఎస్ ప్రెసిడెంట్ ఉషారాణి రూ.5000 విరాళం అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెఎసి నాయకులు ఎస్ రఘురామయ్య, అశోక్ ఆనంద రెడ్డి, పగడాల కోదండ, దస్తగిరి నాయుడు, టి వీరేష్ ,ఎం.రామలింగయ్య, కృష్ణమూర్తి గౌడ్, బార్ అసోసియేషన్ నాయకులు అడ్వకేట్ నాగేంద్రయ్య ఎన్‌జిఒ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్ ఆధ్వర్యంలో కూడలిలో రాస్తారోకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదోని జిల్లాగా ప్రకటించాలని 29వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టిన ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఉద్యమంలో భాగస్వామ్యం అవుతూ మహిళలు సహితం దీక్షకు మద్దతు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. పశ్చిమ ప్రాంత అభివృద్ధికై ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో అన్ని కుల, రాజకీయ, సినీ హీరోల అభిమానుల సంఘాల నాయకులు భాగస్వామ్యం కావాలన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో దీక్షలో కూర్చుని ప్రభుత్వానికి తమ గళాన్ని గట్టిగా వినిపించారు. ఈ దీక్షకు వివిధ ప్రజాసంఘాల మహిళా నాయకులు, కార్మిక మహిళలు, ఉద్యోగినులు, గృహిణులు పాల్గొని ఐక్యతను చాటారు. మహిళలు మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధిలో ఆదోని తీవ్రంగా వెనుకబడి ఉందని, జిల్లా ప్రకటించడమే దీనికి శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు.



ఆదోని దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న మహిళా నేత

ఆదోనిని జిల్లాగా ప్రకటిస్తే కలిగే అభివృద్ధి ప్రయోజనాలు

పరిపాలనా సౌలభ్యం: జిల్లా కేంద్రంగా మారితే ప్రభుత్వ కార్యాలయాలు సమీపంలో ఏర్పడి ప్రజలకు సేవలు వేగంగా అందుతాయన్నారు.

ఉద్యోగ అవకాశాలు: జిల్లా కార్యాలయాలు, అనుబంధ శాఖల ద్వారా యువతకు ఉద్యోగాలు పెరుగుతాయన్నారు. విద్యా అభివద్ధి డిగ్రీ, పీజీ కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు, హాస్టళ్లు ఏర్పాటు కావడానికి అవకాశం కలుగుతుందన్నారు. వైద్య సదుపాయాల్లో భాగంగా జిల్లా స్థాయి ఆసుపత్రులు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. మహిళా సంక్షేమంలో భాగంగా మహిళా అభివృద్ధి శాఖలు, రక్షణ కేంద్రాలు, స్వయం ఉపాధి పథకాలు విస్తరిస్తాయన్నారు. మౌలిక సదుపాయాలకల్పనలో రోడ్లు, రవాణా, తాగునీరు, డ్రైనేజీ, గృహ నిర్మాణం వంటి సదుపాయాలు మెరుగుపడతాయన్నారు.

వ్యాపార-పారిశ్రామిక అభివృద్ధి: చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పడి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. 29 రోజులుగా శాంతియుతంగా కొనసాగుతున్న ఈ దీక్షలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని మహిళలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్రీడల అభివృద్ధికి నాయకుల కృషి

పూలచింత గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నందవరం

మండలంలో క్రీడల అభివృద్ధికి టిడిపి నాయకులు విశేషంగా కృషి చేస్తున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో క్రీడలను నిర్వహిస్తున్నారు. నాయకుల ప్రోత్సాహం వలన క్రీడాకారులు క్రీడలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రీడల అభివృద్ధికి నాయకులు సహకార అందించడం హర్షించదగ్గ విషయమని ప్రజలు,యువత ప్రశంసలు కురిపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం సజీవపురంలో మాధవరావు దేశయ్ భారీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. అదే విధంగా మండల పరిధి పూలచింత గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా సర్పంచి బండే గురుస్వామి ఆధ్వర్యంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, సీనియర్ నాయకులు, మిల్లు అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలలో యువత రాణించాలన్నారు. ఇటీవల జరిగిన ప్రపంచకప్‌లో మన జట్టు మహిళ క్రికెట్ జట్టు ప్రపంచ విజేతగా నిలిచిందని, దేశం గర్వించే విధంగా మన సత్తా చాటారని గుర్తుచేశారు. వారిని ఆదర్శంగా తీసుకొని యువత దేశ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. టోర్నమెంటులో గెలిచిన విజేతకు ఫస్ట్ బహుమతి రూ.20వేలు,రెండో బహుమతి రూ.10వేలు ఇస్తున్నట్లు చెప్పారు.అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్ ప్రారంభించారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ యువకులను ప్రోత్సహిస్తున్నందుకు క్రీడాకారులు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గజేంద్రరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నది కైరవాడి వీరారెడ్డి, మండల టిడిపి కార్యదర్శి లచ్చప్ప, గడ్డంబజారి, నాగలాదిన్నే తిమ్మప్ప, నాగలదిన్నె మునఫ్, మాచాపురం సుధాకర్‌రెడ్డి, పెద్దకొత్తిలి రంగన్న, జోహారాపురం నాగేంద్రప్ప, పూలచింత షరీఫ్, బంగారి, రాజు, గంగవరం శాంతిరాజు, సజీవపురం హేజ్ ఖేల్, ముగితి బాలరాజు, నందవరం నరసింహులు, మల్లికార్జున, చాకలి వెంకటేష్, తెలుగు ఈరన్న, మోహన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిసుత్న టిడిపి నాయకులు

ఆదోని జిల్లాతోనే అభివృద్ధి సాధ్యం

-ఆదోని జిల్లా సాధన జెపసి కన్వీనర్ రామతీర్థం అమరేష్

ప్రజాశక్తి-మంత్రాలయం

నియోజకవర్గ అభివృద్ధి ఆదోని జిల్లా తోనే సాధ్యమని ఆదోని జిల్లా సాధన జెఎసి కన్వీనర్, బిఎస్ఎస్ అధ్యక్షులు రామతీర్థం అమరేష్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ రాఘవేంద్ర సర్కిల్‌లో ఆదోనిని జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష 3వ రోజుకు చేరింది. మండల పరిధిలోని చిలకలడోన, బూదూరు గ్రామాలకు చెందిన జయన్న, శాంసోన్, బుడుమయ్య, చిన్నన్న, రంగయ్య, ఏసేపు, లక్ష్మన్న, బోయ విజయుడు, బోయ వీరేష్, బోయ మల్లేష్, బోయ నాగరాజు, బోయ రామంజి, దేవదానంలు సంఘీభావం తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోనిని జిల్లాగా ఆకాంక్షతో ప్రజల మద్దతు పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఆదోని జిల్లాగా కావాలని ఏకపక్షంగా కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజలంతా తమకు మద్దతుగా ఉంటూ ఆదోని జిల్లా సాధించేంతవరకు పోరాటాలు ఆగవని హెచ్చరించారు. రాజకీయ పాలకులు ఆదోనిని జిల్లాగా సాధించకపోతే రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి రాష్ట్ర కన్వీనర్ మంచాల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు గుడిపి సామేల్, దళిత సీనియర్ నాయకులు రాంపోగు సుందర్రాజు, గుడేకల్ గ్రామ నాయకులు నాగరాజులు, బహుజన సమైక్య సమితి నాయకులు ప్రసన్నకుమార్, రాజేష్, కాలేబు మాల మహానాడు జిల్లా కార్యదర్శి మాల ఉసేని, బీసీ సంఘ నాయకులు దేవేంద్ర, విద్యార్థి సంఘ నాయకుడు మోహన్ తదితర సంఘాలు మద్దతుగా సంఘీభావం తెలిపారు.



వికలాంగుల సంక్షేమమే కూటమి లక్ష్యం

- ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వికలాంగుల సంక్షేమమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీ కుర్ణీ కళ్యాణ మండపంలో వికలాంగుల సాధికారత ఫోరం(డిఇఎఫ్) అధ్యక్షులు బిసి నాగరాజు అధ్యక్షతన 66వ ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి, చైర్మన్ నారాయణ స్వామి మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత కోసం ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే రూ. 3వేల పింఛనును రూ. 6వేలకు పెంచినట్లు తెలిపారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇంద్ర ధనుస్సు అనే అత్యద్భుతమైన పథకాలు అమలు చేయాలని నిర్ణయించారని తెలిపారు. డిఇఎఫ్ గౌరవాధ్యక్షులు ఆల్ఫ్రెడ్ రాజు, అధ్యక్షులు బిసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. శివశంకర్, కోశాధికారి ఆదిశేషయ్య, మహిళా కన్వీనర్ బాలకుళ్ళాయమ్మలు మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య , మాజీ కౌన్సిలర్ కలీముల్లా పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



- మాట్లాడుతున్న ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి

అంతర్జాతీయ స్థాయిలో రోటరీ క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆదోని

రోటరీ క్లబ్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని కాబోయే రోటరీ డిస్టిక్ గవర్నర్ త్రివిక్రమ్ జోషి పేర్కొన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ ఆక్టివిటీస్ 2025-26 యాన్యువల్ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ఆదివారం నిర్వహించారు. త్రివిక్రమ్ జోషి, డిఇఒ రాజేంద్రప్రసాద్, లెక్చరర్ కళ్యాణ్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్ల, సెక్రటరీ మేఘనాథ్ రెడ్డి, యూత్ ఆఫీసర్ సాబీర్, వికాస్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి చేశారు. అనంతరం కాగడను చేత పట్టుకుని గ్రౌండ్లో తిరిగి ఆటల పోటీలను ప్రారంభించారు. ఆటల పోటీల్లో 60 స్కూళ్ల నుండి దాదాపు 3,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైపూన్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మానసికంగా చాలా దృఢంగా ఉంటారని తెలిపారు. ఫుట్బాల్, త్రోబాల్, కబడ్డీ, డాడ్జ్ బాల్, బాస్కెట్బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, టెన్నికాయిట్ ఆటల పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కప్పులతోపాటు సర్టిఫికెట్ అందజేశారు. క్రీడా పోటీలు సజావుగా సాగేందుకు కృషి చేసిన 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులను, పిఇటిలను ఘనంగా సన్మానించారు. పోటీల్లో పాల్గొన విద్యార్థి విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుడు సునీల్ రెడ్డి అధ్యక్షతన భోజన వసతిని కల్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ట్రెజరర్ షణ్ముఖ, సభ్యులు శ్రీధర్ రెడ్డి, జీవన్ సింగ్, అన్న విట్టా మురళీధర్, సోమశేఖర్ రెడ్డి, భరత్‌షా, ప్రశాంత్ గాంధీ, సుబ్బయ్య, వీరేష్ స్వామి, పద్మనాభయ్య శెట్టి, సందీప్ రెడ్డి, శేషయ్య, శివరాం, హుస్సేన్ భాష, వినయ్ పాల్గొన్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణిస్తే జారీ పడాల్సిందే

ప్రజాశక్తి-కోసిగి

కోసిగి నుండి దుద్ది గ్రామానికి వెళ్లే దారిలో మధ్యలో దుద్ది రిజర్వాయర్ ముందు లీకేజీ నీరు నిల్వ ఉండడంతో నిత్యం వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అటుగా పొలానికి వెళ్లే రైతులకు సైతం ఈ కష్టం తప్పడం లేదు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే కచ్చితంగా జారి పడాల్సిందే.. ఈ రోడ్డు నీరునిల్వ ఉండటంవల్ల అటుగా వెళుతున్న పాదాచారులు , వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని ఏళ్లుగా ఈ రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో పాచి పట్టి గుంతలు పడి రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుపై నీరు నిలువ ఉండకుండా చూసి , కల్వర్టు ఏర్పాటు చేసి రోడ్డు బాగు చేయాలని రైతులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గ్రామాలను విలీనం చెయ్యొద్దు

ప్రజాశక్తి - ఆదోని : కొత్తగా ఏర్పాటు కానున్న పెద్ద హరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం చెయ్యొద్దని, ఇందుకు సహకరించాలని సర్పంచులు, ఎంపీటీసీలు చంద్రశేఖర్, నారాయణ, టిడిపి నాయకుడు వేణుగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడుకు వారు ఆదివారం వినతి పత్రం అందజేశారు. 16 గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు మాట్లాడుతూ గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకోకుండానే పెద్ద హరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం చేయాలని అధికారులు నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను ఇంతటితో ఆపేయాలని, లేని ఎడల స్థానిక సంస్థల ఎన్నికలను ఐకమత్యంతో బహిష్కరిస్తామన్నారు. మధిరే, చిన్న హరివాణం, సంతే కొల్లూరు, దానాపురం, నారాయణపురం, చాగి, నాగనాతనహళ్లి, గణేకల్లు, జిహోసలి బసపురం 16 గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇందుకు సహకరించాలని మీనాక్షి నాయుడుకు విజ్ఞప్తి చేశారు.నాయకులు ఈరన్న గౌడ్, రామస్వామి, మధుసూదన్ రెడ్డి, గనేకల్ విరుపాక్షి ఉన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - నందవరం




మండల పరిధిలోని ముగతి గ్రామం శ్రీమాతలక్ష్మమ్మదేవి ఆలయ నిర్మాణానికి ముగతి గ్రామానికి చెందిన ధాతలు భీమ్ రెడ్డి కుమారుడు రంగారెడ్డి రూ. లక్ష విరాళాన్ని ఆదివారం గ్రామ పెద్దలకు అందజేశారు. ధాత రంగారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణంలో నా సహకారం ఉండడం ఆనందంగా ఉందని తెలిపారు. రంగారెడ్డి గ్రామంలో ఆలయ నిర్మాణాలకు ఆర్థిక సహాయాన్ని అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రస్తుత లక్ష్మమ్మదేవి ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళంగా అందజేసినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు రంగారెడ్డి కుటుంబానికి ఉండాలని వారు ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు ముగతి ఈరన్నగౌడు, వీరుపాక్షిరెడ్డి, కొండారెడ్డి, గుగ్గిరి నరసింహులు, కొండన్న, రాము, అంజినయ్య, బోయ ఈరన్న, హుసేనయ్య పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి

-ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి- మంత్రాలయం



సద్గురు శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి సూచించారు. ఆదివారం స్థానికంగా నిర్మించిన వసతి గృహం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన చింతరేవుల ఆంజనేయ స్వామి పూజారి చక్రపాణి జోషి ,పద్మావతి ల ఆహ్వానం మేరకు వచ్చిన వారికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వారి వెంట వైసిపి మండల అధ్యక్షుడు భీమిరెడ్డి, రవి రెడ్డి ఉన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు రూ. 15వేల వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న స్వచ్ఛభారత్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 15వేలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య కార్మికుల సమస్యలపై ఆదివారం సర్వే చేసి మాట్లాడారు. వీరికి ప్రస్తుతం రూ. 6వేల వేతనం ఇవ్వడం అన్యాయమన్నారు. జీవో నెంబర్ 7, 151లను గ్రామీణ స్వచ్ఛభారత్ కార్మికులకు ఎందుకు అమలు చేయడం లేదని డిప్యూటీ సీఎంను ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో పారిశుధ్య కార్మికులు గ్రామీణ ప్రాంతాల్లో చెత్త, మురుగు కాల్వలు శుభ్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. వీరికి పీఎఫ్ సౌకర్యం గాని క్యాజువల్ సెలవులు గాని పారిశుధ్య పనిముట్లు గాని ఇవ్వడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బి గోపాల్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమైక్యతతో అందరి కుటుంబాల్లో వెలుగులు నింపాలి

ప్రజాశక్తి - మంత్రాలయం



సమైక్యతతో అందరి కుటుంబాల్లో వెలుగులు నింపే ప్రయత్నం చేయాలని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు పేర్కొన్నారు. ఆదివారం మంత్రాలయం హెచ్ఆర్‌బి కళ్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్ఎస్ ఎస్) ఆధ్వర్యంలో శతజయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. మత విద్వేషాలతో సతమతమవుతున్న భారత దేశంలో హిందువులు ఇతర మతాలను గౌరవిస్తూ హిందూ మతాన్ని విస్మరిస్తున్నారని తెలిపారు. ఇతర మతాల వారిని గౌరవించడం మన సంస్కారం అయినప్పటికి హిందువుల ఐక్యతను చాటి చెప్పడంలో విఫలం అవుతున్నామని పేర్కొన్నారు. కలిసి మెలిసి ఉండే కుటుంబాల సంఖ్య పెరగాలన్నారు. ప్రతి కుటుంబంలో చిన్న తనం నుంచి తమ పిల్లలకు ఆధ్యాత్మికత ను నేర్పిస్తూ హిందూ మత ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా చూడాలని కోరారు. చదువు విజ్ఞతను నేర్పించినప్పటికి భక్తి అనే ఆధ్యాత్మికను నేర్పుతుందని తెలిపారు. ఇక నుంచి మంత్రాలయంలో ప్రతి ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి హిందూ ఐక్యతకు కృషి చేయాలని అందుకు కావలసిన స్థలం ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కుల మతాలు ఎచ్చుతగ్గులు తగ్గించే ప్రయత్నం చేయాలని కోరారు. అలాంటి వాతావరణం నెలకొల్పేందుకు అందరూ కలిసి కట్టుగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ఆర్ఎస్ఎస్ ప్రాంత సద్భావన ప్రముఖ్ ఓలేటి సత్యనారాయణ, గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, హిందూ సమ్మేళన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి పార్లమెంటరీ కమిటీ సమన్వయ కర్త బుట్టరేణుక

కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆదోని జిల్లా ఏర్పాటు కోసం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం ఐదోరోజు కొనసాగాయి. రిలే నిరాహారదీక్షలకు వివిధ ప్రజా సంఘాలు, వైసిపి శ్రేణులు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. వాల్మీకి సంఘం నాయకులు విజిఆర్ కొండయ్య, వైసిపి పార్లమెంటరీ సమన్వయకర్త బుట్ట రేణుక మాట్లాడుతూ ఆదోని జిల్లా ఐదు నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అన్నారు. ఆదోని జిల్లాగా ఏర్పడితే కేంద్ర ప్రయోజత పథకాలైన మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకానికి అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకానికి అలాగే స్వచ్ఛభారత్ మిషన్ పథకానికి జల్ జీవన్ మిషన్ పథకానికి వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక గ్రాండ్ రూపంలో ప్రత్యేక విధులు వస్తాయన్నారు. పశ్చిమ ప్రాంతంలో వలసలు కరువు తగ్గుతాయని, అక్షరాస్యత శాతం పెరుగుతుందన్నారు. దీక్షలో కూర్చున్న వారు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బాలరాజు, పట్టణ కార్యదర్శి బాబు, రైతు కూలీ సంఘం నాయకులు ఎల్లప్ప, జేఏసీ నాయకులు బతుకన్న, సత్యనారాయణరెడ్డి, విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, రఘునాథ, ఖాజా ఆఫ్రిది పాల్గొన్నారు.

ఈరన్న స్వామి దేవాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- కౌతాళం



శ్రీ లక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థాన అభివృద్ధికి కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు తాలూకా, గుడికల్ బోయ ఉల్లిగయ్య , నారాయణ కవిత రూ.1,01,500 విరాళంగా అందజేశారని అర్చకులు వీరేంద్ర, సిబ్బంది తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ దేవస్థాన అధికారులచే వారికి స్వామివారి దర్శనం కల్పించడంతో పాటుశ్రీ స్వామివారి శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదం అందజేశారు. దేవాలయంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని భక్తులు విరివిగా విరాళాలు అందించి అభివృద్ధిలోపాలు పంచుకోవాలని కోరారు.

పరిస్థితి విషమించి మహిళ మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కరివేముల-తెర్నేకల్ గ్రామాల రహదారి మధ్యలో మోటార్ సైకిల్‌పై కిందపడిన చిట్టెమ్మ(52) అనే మహిళ తీవ్ర గాయాలకుగురై కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 11న కర్నూలు సమీపంలోని పందిపాడులో ఉండే బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తేర్నేకల్ స్వగ్రామానికి రత్నాచారి అని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వాహనదారుడు అతి వేగంతో వెలుతూ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడిపోయింది. తీవ్ర గాయాలకుగురైన బాధితురాలిని చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సవాలలో ప్రముఖులు

ప్రజాశక్తి -కౌతాళం



శ్రీ సాని ఖాదర్ లింగా స్వామి కురుగోడు 4వ ఉరుసు ఉత్సవాలు నిర్వహిం చారు. ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఆంధ్ర కర్ణాటక భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతులు శ్రీ జైనుద్దీన్ పాష(మున్నా సాహెబ్) ఆధ్వర్యంలో భక్తులకు ఆశీస్సులు కల్పించారు. ఈ ఉరుసు ఉత్సవాలలో స్వామి వారిని దర్శించు కొన్న కౌతాళం మండల వైసిపి కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకర్, ఉప సర్పంచి సాక్రి తిక్కాయ, వడ్డే ఉసేని, వడ్డే రామన్న, సుగురప్ప,హోటల్ బసవ. నాయకులు కార్యకర్తలు దర్గా పీఠాధిపతులు వారిని సాల్వాలతో సత్కరించి వారికి ఆ దేవుడి ఆశీర్వచనలు ఎల్లప్పుడూ మీ మీద ఉండాలని దర్గా పీఠాధిపతులు ఆశీర్వదించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, చౌదరి సోమన్న, తుంగభద్ర బోర్డు చైర్మన్ బోర్డు టిప్పుసుల్తాన్ ,సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు, సీనియర్ నాయకులు సాయిబాబా, అడివప్ప గౌడ్, టౌన్ అధ్యక్షులు రాజానందు, బిజెపి నాయకులు నబి రామచంద్ర వేరువేరుగా స్వామివారిని దర్శించు కుని నిర్వహించారు. వీరికి దర్గా పీఠాధిపతులు శాలువాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

తుగ్గలి నాగేంద్ర ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - ఆస్పరి

తుగ్గలి నాగేంద్రకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం మండల కన్వీనర్ ఉరుకుందు, నాయకులు నాగేంద్ర, చంద్ర, నారాయణ అన్నారు. స్థానిక గాంధీ పార్క్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తుగ్గలి నాగేంద్ర పని చేస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారన్నారు. టిడిపిలో పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో కూటమి నాయకుల గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

సిసి రోడ్డుకు ఎంపిపి భూమి పూజ

ప్రజాశక్తి - దేవనకొండ

తెర్నేకల్ గ్రామం బీసీ కాలనీలో రూ. 6లక్షలు వెచ్చించి ఎంపిపి నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు మాజీ కేడీసీసీ డైరెక్టర్ ముంబా, గ్రామ సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపిపి లక్ష్మీదేవి ఆదివారం భూమి పూజ చేశారు. సర్పంచి మాట్లాడుతూ కాలనీవాసులకు రోడ్డు సౌకర్యం కోసం ఎంపిపి నిధుల కింద రూ. 6లక్షలు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి నామాల శ్రీను, మాజీ ఎంపిటిసి చాప ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, వార్డు మెంబర్లు తలారి దొడ్డప్ప, చాకలి సువర్ణ భర్త చాకలి బడిశావు, వైసీపీ నాయకులు డబల్ మాబు, సత్యన్న పెద్దయ్, సూరన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేద , అనాథ పిల్లల సంక్షేమానికి అందరూ ముందుకు రావాలని సేవ చేయడమే నిజమైన మానవత్వం అని నేడు జరిగిన అభయగిరిలోని బాధిత పిల్లలకు ఉచిత బట్టలు, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథి సిఐడి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.పెద్దయ్య నాయుడు మాట్లాడుతూ బాలల విద్యా, ఆరోగ్యం, భవిష్యత్తు పట్ల సమాజం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లను తనవంతుగా త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ సర్వీస్ యూనిట్ మెంబర్, జిల్లా చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్‌స్పెక్షన్ కమిటీ మెంబర్ లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపచేస్తా యన్నారు. చిన్నారుల భవిష్యత్తు కోసం మనమందరం సహాయ సహకారాలు అందించాలన్నారు .లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ గౌరవాధ్యక్షులు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి లయన్ కెజెడి బాబు మాట్లాడుతూ పిల్లలకు అవసరమైన వస్త్రాలు రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశామని, బాధిత పిల్లల పట్ల ఆప్యాయతతో పాటు అవసరమైన సహాయం అందించడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సుమారు రూ.50వేల విలువైన వస్త్రాలు ,నిత్యవసర సరుకులు బాధిత పిల్లలకు అందజేశారు. నవమణి, ఉపాధ్యాయురాలు చిన్నమ్మబాయి ,మెర్సీహో లెప్రసీ అండ్ ఎయిడ్స్ సెంటర్ ఇన్చార్జి సిస్టర్ సారంగా, సిస్టర్ సిని, దివ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రాయపాటి శ్రీనివాస్, తదితరులు

దత్తత గ్రామంలో అభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి - ఆదోని

దత్తత తీసుకున్న సుల్తానాపురం గ్రామంలో గుంతలు పడ్డ రోడ్డుకు గ్రావెల్‌తో చదును చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి గుడిసె ఆదికృష్ణమ్మ తెలిపారు. గ్రామంలో గ్రావెల్‌తో ఆమె ఆదివారం రోడ్లను చదును చేయించారు. ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన ఆదోని నియోజకవర్గం సుల్తానాపురం గ్రామం అభివృద్ధి దిశగా ముందడుగు వేసిందన్నారు. దత్తత తీసుకున్న గ్రామంగా ప్రకటించినప్పటి నుంచే అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్రామంలో మట్టి రోడ్డు మరమ్మతులు, డ్రెయినేజీ పనులను పర్యవేక్షించారు. గ్రామంలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఏళ్లతరబడి ఇబ్బందులు పడుతున్నా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. మాటల పాలన కాదు.. చేతల పాలన ప్రారంభమైందన్నారు. దత్తత తీసుకున్న సుల్తానాపురం గ్రామాన్ని అభివృద్ధిలో మోడల్ గ్రామంగా మార్చడమే లక్ష్యమన్నారు. వర్షాకాలంలో మురుగునీరు వీధుల్లోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గుర్తించి డ్రెయినేజీ పనులను ప్రాధాన్యతగా చేపట్టామన్నారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు పనులు చేపట్టిన గుడిసె ఆది కృష్ణమ్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజశేఖర్, లక్ష్మీనారాయణ, నాగరాజు, భాస్కర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆది గుడిసే కృష్ణమ్మ

ఇంధన పరిరక్షణపై తిరుపతిలో సైన్స్ ఎగ్జిబిషన్

-విద్యార్థులకు స్టాల్స్ ఏర్పాటు పోటీలు
-17 లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
-ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా ఈనెల 19, 20 తేదీల్లో తిరుపతిలోని శ్రీ పద్మావతి కళ్యాణ మండపం, బ్లాక్ నంబరు-2లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు ఇంధన పరిరక్షణ-ఆవశ్యకత అంశంపై స్టాల్స్ ఏర్పాటు పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 9,10వతరగతి చదివే విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు తమ పేరు, పాఠశాల పేరు, చిరునామా, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడి తదితర వివరాలను వాట్సాప్ నంబరు: 87124 80430కు పంపి నమోదు చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు ఇంధన పరిరక్షణ అంశంపై సంస్థ పరిదిలోని 9 జిల్లాల్లో విద్యార్థులకు వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారని, ఈ పోటీల్లో పాల్గొని, గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 17నన తిరుపతి నుంచి ఆన్‌లైన్ ద్వారా ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఈనెల 20న బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి: సిపిఐ

ప్రజాశక్తి- కోడుమూరు

కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కిలెనిన్ బాబు డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా కర్నూలు జిల్లాలో పంటపొలాలు నీరు అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లాలో పెండింగులో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని, గుండ్రేవుల ప్రాజెక్టు ద్వారా కోడుమూరు నియోజకవర్గ ప్రజలకు తాగునీరు సాగునీరు అందించాలని కోరారు. ఆదివారం కోడుమూరు సిపిఐ భవన్‌లో నియోజవర్గ పరిధిలోని గూడూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల జనరల్ బాడీ సమావేశం ఈ సమావేశం మండల కార్యదర్శి బి రాజు అధ్యక్షతన నిర్వహించారు. నక్కి లెనిన్ బాబు మాట్లాడుతూ సిపిఐ డిసెంబర్ 25న పార్టీ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కావాలంటే రాష్ట్రంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, నూతన పరిశ్రమలు, వెనుక ఉన్న ప్రాంతాల రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ , రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ శాఖలో ఉన్న ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ, రైతాంగ కార్మిక మహిళ సమస్యలపై చర్చించి భవిష్య ఉద్యమాలకు రూపకల్పన చేస్తామని అన్నారు.

ముఖ్యమంత్రి రాజధాని నిర్మాణం,పోలవరం ప్రాజెక్టులపై ఉన్నటువంటి శ్రద్ధ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం కర్నూలు జిల్లా అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేయడం జిల్లా ప్రజలు మోసం చేయడమనని అన్నారు. కర్నూలు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మాధవ స్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి శేష్ కుమార్ సహాయ కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు, సీనియర్ నాయకులు భాస్కర్ ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఎఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి





రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి -మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీ మఠంలో కోలాహలం నెలకొంది. ఆదివారం దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నది తీరంలో నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా ప్రవేశించి స్వామి వారిని దర్శించుకొన్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు భక్తులకు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

శ్రీ మఠంలో ఘనంగా స్వర్ణ రథోత్సవం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తి అయిన ప్రహ్లాద రాయులను స్వర్ణ రథం పై ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో భక్తుల జయ జయ ధ్వనుల మధ్య వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా స్వర్ణ రథోత్సవ సేవ చేయించిన భక్తులకు పీఠాధిపతులు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

పంచాయతీలకు మహర్దశ

జనసేన మండల కన్వీనర్ కె. చిరంజీవి

ప్రజాశక్తి- చిప్పగిరి

కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు అధిక నిధులు మంజూరు చేసి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడవడానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎంతో కషి చేస్తున్నారని వారి వల్లే ఈనాడు పంచాయతీలు కు మహర్దశ కల్పించారని జనసేన మండల కన్వీనర్ కె.చిరంజీవి తెలిపారు. ఆదివారం చిప్పగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పట్టుదలతో పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించడానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఈ మధ్యన అంధుల క్రికెట్ పోటీలో గెలిచిన మహిళ క్రీడాకారులు అందరికి కూడా నగదు బహుమతితో పాటు వారికి పట్టుచీర పూలదండ,శాలువాలతో ఘనంగా సన్మానించారు. టీంలో ఉన్న ఒక సభ్యురాలు మా గ్రామానికి సరైన రహదారి లేదని విన్నవించగా వెంటనే స్పందించి సాయంత్రం లోపల రోడ్డు వేయడానికి నిధులు కేటాయించిన ఘనత మన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు దక్కుతుందన్నారు. ప్రతి జనసేన కార్యకర్త మన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న పనులను ప్రజలకు వివరించి ప్రతి గ్రామంలో కూడా జనసేన పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు.

ఉషు పోటీలలో జిల్లా క్రీడామణులకు పతకాలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఈనెల 8, 9 తేదీలలో రాజమండ్రిలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి ఉషఉ పోటీలలో కర్నూలు జిల్లా క్రీడామణులు రెండో స్థానంలో నిలిచారు. ఆదివారం పెద్ద మార్కెట్ దగ్గిర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అభినందనకార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా ఉషు సంఘం అధ్యక్షులు బిజినేపల్లిసందీప్ విచ్చేసి మాట్లాడుతూ క్రీడాకారులను అభినందిస్తూ జిల్లా క్రీడమణులు రెండవ స్థానంలో నిలిచారని 39 పథకాలు సాధించారని, ఖేలో ఇండియా పోటీలలో మన కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని, చదువుతో పాటు ఉషు మార్షల్ ఆర్ట్స్ క్రీడను నేర్చుకోవాలన్నారు. జాతీయస్థాయి ఉషు పోటీలలో పాల్గొనాలని అన్నారు. అనంతరం విద్యార్థినీలకు అధ్యక్షులు బిజినేపల్లి సందీప్ పతకాలను , సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. గోల్డ్ మెడల్ సాధించిన కె.యల్లేశ్వరి. సి.బలివీక, ఎం.యషితరెడ్డి, ఎం.తోసిఫా సిద్ధిక్, టి.సాయి దామిని, సిల్వర్ మెడల్ సాధించిన జి.నాగలక్ష్మి, ఎస్.రేణుక మాధవి, బ్రాంజ్‌మెడల్ సాధించిన టి.వైష్ణవి, కె.పునర్వికలను జిల్లా ఉషు సంఘం కార్యదర్శి టి. శ్రీనివాసులు అభినందించారు.

